నమస్తే తెలంగాణ
# వికారాబాద్
I హైదరాబాద్, గురువారం 21 నవంబర్ 2024 VIKARABAD



పట్నం నరేందర్‌రెడ్డిని తీసుకెళుతున్న పోలీసు వాహనాన్ని చుట్టుముట్టిన బీఆర్‌ఎస్ నాయకులు

# నిర్దోషిగా బయటకు రావడం ఖాయం

**మాజీ ఎమ్మెల్యే పట్నం మహేందర్‌రెడ్డిపై సీఎం రాజకీయ కక్ష**

**రైతులకు మద్దతు తెలిపితే అరెస్టు చేయడం సిగ్గుచేటు**

**ప్రభుత్వ వైఖరి కారణంగానే రైతుల దాడి**

**కొడంగల్ కోర్టు వద్ద బీఆర్‌ఎస్ నాయకుల ఆందోళన**

కొడంగల్, నవంబర్ 20 : మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిపై రాజకీయంగా కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే లగచెర్ల దాడి ఘటనలో అక్రమంగా అరెస్టు చేశారని బీఆర్‌ఎస్ నాయకులు ఆరోపించారు. బుధవారం కొడంగల్ కోర్టులో కస్టడీ విచారణ నిమిత్తం హాజరైన మాజీ ఎమ్మెల్యేను కలిసేందుకు నియోజకవర్గ పరిధిలోని బీఆర్‌ఎస్ నాయకులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యేను అక్రమంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ కోర్టు వద్ద ఆందోళన చేపట్టారు. రైతులకు అండగా నిలిచిన మాజీ ఎమ్మెల్యేపై అటెంప్ట్ మర్డర్ కేసు బనాయించడం చాలా దారుణమని పేర్కొన్నారు. సంఘటన జరిగిన నాడు మాజీ ఎమ్మెల్యే సంఘటనా స్థలంలో లేరని.. హైదరాబాద్‌లో ఆయన వాకింగ్‌కు వెళ్లే సమయంలో పోలీసులు ఎటువంటి సమాచారం అందించకుండా సివిల్ డ్రెస్‌లో వచ్చి ఓ సంఘ విద్రోహ వ్యక్తి మాదిరిగా లాక్కొని వెళ్లారని ఆరోపించారు. ప్రభుత్వం, పోలీసుల వైఫల్యం కారణంగానే ప్రతిపక్ష నాయకుడిగా రైతులకు అండగా నిలువడం జరిగిందని.. ప్రభుత్వం, పోలీసుల తప్పిదాన్ని కప్పిపుచ్చుకునేందుకే మాజీ ఎమ్మెల్యే అరెస్టుతో పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నట్లు వారు ఆరోపించారు.

### బేషరతుగా విడుదల చేయాలి..

గత 10 నెలల కాలంగా భూములను కాపాడుకునేందుకు రైతులు అలుపెరగని పోరాటం చేస్తుంటే నేటి వరకు కూడా రైతులతో సీఎం ఒక్క మాట కూడా మాట్లాడలేదన్నారు. ఎన్నికల సమయంలో మార్పు తీసుకొని వస్తానని చెప్పిన మాట నేటి లగచెర్ల ఘటనతో నివృత్తి అయిందన్నారు. కోట్ల విలువ చేసే భూములను అభివృద్ధి పేరుతో రూ.10లక్షలతో లాక్కోవడానికి ప్రయత్నిస్తుంటే రైతులు ఆందోళన ఎందుకు చెందరని ప్రశ్నించారు. సంఘటన జరిగిన తరువాత కాంగ్రెస్ నాయకులు మాట మార్చి ఫార్మా కాదు పరిశ్రమల హబ్‌గా తీర్చుదిద్దుతామని ప్రకటనలు చేస్తున్నారని ఆరోపించారు. ఫార్మా కంపెనీల కోసం భూ సేకరణ చేపడుతున్నామని రైతులతో అధికారులు పేర్కొనడం జరిగిందన్నారు. ఫార్మా కంపెనీల ఏర్పాటు జరిగితే ఈ ప్రాంతం పూర్తిగా సర్వనాశనం అవుతుందని, ఈ విషయం సీఎం గుర్తించలేదా అని ప్రశ్నించారు. ఈ ప్రాంత రైతులు ఓటేసి గెలిపించిన పాపానికి కాలుష్యాన్ని అంటగట్టే ప్రయత్నాన్ని సీఎం చేస్తున్నారని పేర్కొన్నారు. స్వయంగా కాంగ్రెస్ ఎమ్మెల్యే ఫార్మా కంపెనీపై తీవ్రంగా ధ్వజమెత్తుతుంటే, సీఎం ఈ ప్రాంత ప్రజలకు అనారోగ్యాన్ని అంటగట్టే విధంగా ఫార్మా కంపెనీలను ఏర్పాటు చేయడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. ప్రభుత్వ వైఖరి కారణంగానే ప్రతిపక్ష నేతగా మాజీ ఎమ్మెల్యే రైతులకు అండగా నిలిచారని, అంతమాత్రాన కేసులో ఇరికించి అరెస్టు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా మాజీ ఎమ్మెల్యే నిర్దోషిగా బయటకు రావడం ఖాయంగా పేర్కొన్నారు. ప్రభుత్వ వైఖరిని తప్పు పడుతూ అక్రమంగా అరెస్టు చేసిన మాజీ ఎమ్మెల్యేను బేషరతుగా విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు.



సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా జూబ్లీహిల్స్‌లోని భరణి లే అవుట్‌లో నివాసముంటున్న నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ సిబ్బందికి తమ కుటుంబ వివరాలను అందజేశారు.
-బంజారాహిల్స్, నవంబర్ 20

## ఔట్ సోర్సింగ్‌లో 1578 పారిశుధ్య కార్మికులు

**నియామకానికి సర్కారు అనుమతి**

సిటీబ్యూరో, నవంబర్ 20 (నమస్తే తెలంగాణ): జీహెచ్‌ఎంసీలో కొత్తగా 1578 శానిటేషన్ వర్కర్ల నియామకానికి అనుమతి ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు పరిపాలన అనుమతులు మంజూరు చేస్తూ జీవో నం. 1473ను జారీ చేసింది. ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన నెలకు రూ.15,600ల వేతనం చొప్పున నియమించనున్నారు. కాగా, ఇప్పటికే జీహెచ్‌ఎంసీ పరిధిలో 25,613ల మంది పారిశుధ్య కార్మికులు ఉండగా, పెరుగుతున్న పారిశుధ్య అవసరాల దృష్ట్యా ఈ నియామకాలను చేపట్టనున్నారు. ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీ ద్వారా వచ్చే ఏడాది మార్చి 31 నాటికల్లా శానిటేషన్ వర్కర్లను నియమించుకోనున్నారు.






*రంగారెడ్డి జిల్లాలో ధాన్యం కొనుగోళ్లపై అధికార యంత్రాంగం సరైన శ్రద్ధ చూపడం లేదని ఆరోపణలొస్తున్నాయి. కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినప్పటికీ కొనుగోళ్లు మాత్రం చేపట్టడంలేదు. కొనుగోలు చేసినా అనేక కొర్రీలు విధిస్తున్నారు. దీంతో రైతుకు సరైన గిట్టుబాటు ధర రావడం లేదు. రైతులు ధాన్యాన్ని ఎక్కువ రోజులు కల్లాల్లో ఉంచుకోలేక తక్కువ ధరలకే దళారులకు అమ్ముకుంటున్నారు. దళారులు రైతుల కల్లాల వద్దకే వెళ్లి తేమ శాతం అధికంగా ఉన్నప్పటికీ కొనుగోలు చేస్తున్నారు. తమకు పెట్టిన పెట్టుబడి కూడా రావడంలేదని రైతులు వాపోతున్నారు.*
*- రంగారెడ్డి, నవంబర్ 20 (నమస్తే తెలంగాణ)*



# అరకొరగా కొనుగోళ్లు

**ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఆంక్షలు విధిస్తున్న అధికారులు**

**చేసేదేమీలేక దళారులను ఆశ్రయిస్తున్న రైతులు**

**లక్ష్యంలో 10 శాతం కూడా పూర్తి కాని కొనుగోళ్లు**

### క్వింటాలుకు రూ.2200

రైతు పండించిన పంటకు ప్రభుత్వం గిట్టుబాటు ధర ఇస్తుందని, ధాన్యాన్ని మొత్తం తామే కొనుగోలు చేస్తామని, రైతులెవరూ దళారులను ఆశ్రయించవద్దని ప్రభుత్వం చెప్పినప్పటికీ అది ఆచరణలో లేకపోవడం వలన రైతులు తప్పనిసరి పరిస్థితిలో దళారులను ఆశ్రయిస్తున్నారు. సన్నవడ్లకు ప్రభుత్వం మద్దతు ధర రూ.2300లతో పాటు రూ.500 బోనస్ కలిపి రూ.2800 ప్రకటించింది. కాని, కొనుగోలు కేంద్రాల్లో తేమ శాతం అధికంగా ఉందని, బోనస్‌ను ఇవ్వడంలేదని ఆరోపణలొస్తున్నాయి. దీంతో దళారులు గ్రామాల్లో కల్లాల వద్దనే క్వింటాలుకు రూ.2200 చొప్పున కొనుగోలు చేస్తున్నారు. మరికొంతమంది రూ.2300లకు కూడా కొనుగోలు చేస్తున్నారు. ఈ పరిస్థితిలో రైతులు కొనుగోలు కేంద్రాలకు వెళ్లలేక అక్కడికక్కడే దళారులకు తక్కువ ధరలకే అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

### గ్రామాల్లో ఎక్కడ చూసినా ధాన్యపు రాశులే..

జిల్లాలో వరికోతలు ముమ్మరమైన నేపథ్యంలో గ్రామాల్లో ఎక్కడ చూసినా ధాన్యపు రాశులే కనిపిస్తున్నాయి. మరోవైపు మద్దతు ధర రాని రైతులు తాము పండించిన ధాన్యాన్ని ఎక్కడికక్కడే రోడ్లపైన ఆరబోసి రైస్ మిల్లులకు తరలించి పట్టించుకుంటున్నారు. మరికొంతమంది కల్లాల్లోనే వారాల తరబడి ధాన్యం ఎండబెడుతున్నారు. కేంద్రాల్లో ఎలాంటి కొర్రీలు లేకుండా ధాన్యాన్ని ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

### ఆసక్తి కనబరచని ప్రభుత్వం

జిల్లాలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో 9 కేంద్రాలు ఏర్పాటు చేయగా.. ఈ ఏడాది 2.14 లక్షల బస్తాలు కొనుగోలు చేయాలని నిర్ణయించింది. కాని, ఇప్పటివరకు 5వేల బస్తాలు మాత్రమే కొనుగోలు చేసింది. అలాగే, సివిల్ సప్లయ్ ఆధ్వర్యంలో ఈ నెలాఖరు వరకు 50వేల టన్నుల వడ్లు కొనుగోలు చేయాల్సి ఉండగా, ఇప్పటివరకు 2,136 టన్నులు మాత్రమే కొనుగోలు చేసింది. దీంతో ధాన్యం కొనుగోళ్లపై ప్రభుత్వానికి ఆసక్తి లేదని రైతులు ఆరోపిస్తున్నారు.

### దళారుల చేతిలో మోసపోతున్నారు..



కొనుగోలు కేంద్రాల్లో రైతులకు గిట్టుబాటు ధర రాకపోవడంతోపాటు, అనేక కొర్రీలు పెడుతుండడంతో రైతులు పండించిన ధాన్యాన్ని దిక్కుతోచని స్థితిలో దళారులకు విక్రయిస్తున్నారు. దీంతో తీవ్రంగా నష్టపోతున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను తక్కువ ధరకే అమ్ముకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. గత ప్రభుత్వంలో రైతు బిడ్డగా కేసీఆర్ అన్నదాతలు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంతో రైతులు సంతోషంగా వ్యవసాయం చేసుకునేవాళ్లు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులంతా దళారుల చేతుల్లో మోసపోయి ఇబ్బందులు పడుతున్నారు.
– గంగిడి భూపాల్‌రెడ్డి, రైతు, హైతాబాద్, షాబాద్

### గిట్టుబాటు ధర అందించాలి..



కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నిలువునా మోసం చేసింది. అదునుకు రైతు భరోసా డబ్బులు అందకపోవడంతో రైతులు అప్పు చేసి పంటలు సాగు చేసుకున్నారు. పండించిన పంటను మార్కెట్‌లో అమ్ముకుందామంటే ఇప్పటివరకు ఇంకా చాలా ప్రాంతాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. వడ్లకు ఇస్తామన్న రూ.500 బోనస్ ఊసే లేదు. కొనుగోలు కేంద్రాల్లో అనేక కొర్రీలు పెట్టి రైతులకు గిట్టుబాటు ధర అందించకపోవడంతో తక్కువ ధరకే దళారులకు అమ్ముకోవాల్సిన పరిస్థితి దాపురించింది. ప్రభుత్వం రైతులు పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర అందించాలి.
– కొత్తపల్లి వెంకట్‌రెడ్డి, రైతు, కుమ్మరిగూడ, షాబాద్



రోడ్లపైన ఆరబోసిన వరిధాన్యం

# ఠాణా ఖర్చులకు పైసల్లేవ్!

**మూడు నాలుగు నెలలకోసారి నిధులు మంజూరు.. ఖర్చుల పేరుతో తిరిగి ప్రారంభమైన మామూళ్ల దందా**

- అప్పుడప్పుడు వచ్చే నిధులను వెనకేసుకుంటున్న కొందరు ఎస్‌హెచ్‌ఓలు
- వాటాల కోసం అధికారుల మధ్య కుమ్ములాటలు
- పోలీస్ శాఖపై అవినీతి మరకను తుడి చేసిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం
- నేడు మళ్లీ పురుడుపోసుకుంటున్న జాడ్యం
- ఉన్నతాధికారులు మేల్కొకపోతే గాడి తప్పే ప్రమాదం



సిటీబ్యూరో, నవంబర్ 20 (నమస్తే తెలంగాణ): పోలీస్ ఠాణాలకు నెలవారీ ఖర్చులకు ప్రభుత్వం అందించే నిధులకు బ్రేక్ పడుతున్నది. దీంతో చాలా పోలీస్‌స్టేషన్లలో అవినీతి, అక్రమాలు పెరుగుతున్నాయనే ఆరోపణలు వస్తున్నాయి. నెలవారీ మామూళ్లు వసూలు చేయడం, ఫిర్యాదుదారులు, నిందితుల వద్ద ఖర్చులకంటూ వసూలు చేస్తూ.. నిధులు రాకపోవడాన్ని కారణంగా చూపిస్తూ.. అవినీతికి ఆజ్యం పోస్తున్నారనే విమర్శలొస్తున్నాయి. కొన్ని పోలీస్‌స్టేషన్లకు మూడు నాలుగు నెలలుగా నిధులు రావడం లేదని పోలీసు వర్గాల్లో చర్చనడుస్తున్నది. కొందరు ఇన్‌స్పెక్టర్లు ఇదే అదనుగా ఒకేసారి మూడు నాలుగు నెలలకు పోలీస్‌స్టేషన్‌కు వచ్చే నిధులను ప్రభుత్వం విడుదల చేసిందంటే.. ఆ డబ్బులను నేరుగా వెనకేసుకునే పనిలో ఉన్నారన్న ఆరోపణలున్నాయి. ఇలా ఠాణా నిర్వహణకు వచ్చే ఖర్చుల పంపకాల్లో ఎస్‌హెచ్‌ఓ, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ (డీఐ)ల మధ్య తగాదాలు కూడా చోటు చేసుకుంటున్నట్లు తెలిసింది. ట్రై పోలీస్ కమిషనరేట్ పరిధిలోని చాలా ఠాణాల్లో ఈ వ్యవహారం కొనసాగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

### అవినీతి మరకను తుడిచేసిన గత సర్కారు

ఠాణాలకు వచ్చే ప్రజల నుంచి ఒక పైసా కూడా తీసుకోవద్దని, నెలవారీ మామూళ్లు వసూలు చేయవద్దని, గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం..2015లో పోలీస్‌స్టేషన్లలో ఖర్చులకు నిధులు మంజూరు చేసింది. పీఎస్‌లను ఏ,బీ,సీ విభాగాలు చేసి ప్రధాన నగరాల్లో ఉన్న ఠాణాలను ఏ గ్రేడ్ కింద నెలకు రూ. 75 వేలు, ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు రూ. 25 వేల చొప్పున నిధులను కేటాయించింది. వీటిని పోలీస్‌స్టేషన్‌కు వచ్చే వారికి అవసరమైతే మంచినీళ్లు, టీ ఇవ్వడంతో పాటు కేసుల ఇతరత్రా అయ్యే టీ ఖర్చుతో పాటు స్టేషనరీ, ట్రాన్స్‌పోర్టు, రవాణా ఖర్చులు, సిబ్బంది భోజనం వంటి వాటికి ఖర్చుపెట్టాలని సూచించింది. కేసుల దర్యాప్తునకు అయ్యే ఖర్చులు పూర్తిగా పోలీసులే భరించాలని, తద్వారా పోలీసులు చెయ్యి చాచి ఎవరినీ డబ్బులు అడిగే పరిస్థితి ఉండవద్దని, మామూళ్లు అనేవి ఎట్టి పరిస్థితుల్లోనూ ఉండవద్దని బీఆర్‌ఎస్ ప్రభుత్వం పోలీసు శాఖపై ఉన్న అవినీతి మరకను తుడి చేసింది.

### పెండింగ్‌లో పెట్టడం వల్లే..

ఇదిలాఉండగా బిల్లులు పెండింగ్‌లో ఉండగానే ఆ ఎస్‌హెచ్‌ఓ బదిలీ అయితే.. ఆ బిల్లులు కొత్తగా వచ్చిన ఎస్‌హెచ్‌ఓ హయాంలో మంజూరైతే అవి తాను గతంలో ఖర్చుచేసిన బిల్లులని తనకే రావాలంటూ పాతవారు, 'లేదు నాకు సంబంధం లేదు.. నేను వచ్చిన తరువాత మంజూరయ్యాయి.. అవి మాకే' అంటూ కొత్తవాళ్లు కూడా గొడవ పడుతున్నట్లు సమాచారం. అలాగే ఠాణాలకు వచ్చే నిధుల్లో ఏసీపీలు కూడా కొందరు వాటాలు తీసుకుంటున్నట్లు సమాచారం. నెలవారీగా ఠాణాకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే ఎలాంటి సమస్యలుండవని, అలా కాకుండా పెండింగ్‌లో పెట్టడం వల్ల ఎన్నో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని పోలీసులు మాట్లాడుకుంటున్నారు. దీనిపై ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకొని, నిధులు సక్రమంగా విడుదల చేయించాలని, పోలీస్ శాఖలో మొదలైన అవినీతిని మొక్కగా ఉన్నప్పుడు తొలగించాలని, లేదంటే భవిష్యత్‌లో అవినీతి పెరిగి పోలీస్ శాఖకు చెడ్డపేరు వచ్చే అవకాశాలు ఉంటాయని పలువురు హెచ్చరిస్తున్నారు.

### డమ్మీ బిల్లులు..

ప్రభుత్వం పోలీస్‌స్టేషన్లకు విడుదల చేసే నిధులను నిజాయతీగా ఖర్చుపెట్టే అధికారులు చాలా తక్కువ మందే ఉంటారని మాట్లాడుకుంటున్నారు. మిగతా వారిలో కొందరు సగం ఠాణాకు ఖర్చు చేసి సగం తమ జేబులో వేసుకుంటున్నారని, మరికొందరు వచ్చిన దాంట్లో సగం డీఐ, ఎస్సైలకు పంచేసి మిగతాది తమ జేబులో వేసుకుంటున్నారన్న చర్చ నడుస్తున్నది. ప్రతి నెలా స్టేషనరీ, ట్రావెల్, భోజనాల ఖర్చులు ఇలా అన్ని బిల్లులు తయారు చేసే స్టేషన్ రైటర్ లేదా అకౌంటెంట్ ద్వారా ఆ బిల్లులను కమిషనరేట్ కార్యాలయానికి పంపిస్తే.. అక్కడి నుంచి పే అండ్ అకౌంట్స్ విభాగానికి వెళ్తాయి.. ఆ తరువాత అక్కడి నుంచి ఆయా ఠాణాలకు చెక్కులు జారీ అవుతుంటాయి. చాలా మంది ఇన్‌స్పెక్టర్లు ఈ బిల్లులను డమ్మీవి పెడుతున్నట్లు ఆరోపణలున్నాయి.

### ఎస్‌హెచ్‌ఓల జిమ్మిక్కులు..

ముందుగా ఖర్చుపెట్టి ఆ బిల్లులనే మేం పెడుతున్నామని.. ఎవరికీ వాటాలు ఇచ్చేది లేదంటూ కొందరు ఇన్‌స్పెక్టర్లు ఆయా ఠాణాల్లోని డీఐలు, ఎస్సైలకు తేల్చి చెబుతున్నట్లు ఆరోపణలున్నాయి. ఆయా కేసుల్లో ఏమైనా ఖర్చులు ఉంటే ఎవరి కేసుకు సంబంధించి వారే వెచ్చిస్తుంటారు. ఆ విషయాన్ని పట్టించుకోకుండా కొందరు ఎస్‌హెచ్‌ఓలు ఆయా పనులన్నీ తమ సొంత ఖాతాలో వేసుకొని అందుకు సంబంధించిన బిల్లులు పైకి పంపిస్తున్నట్లు పలువురు చర్చించుకుంటున్నారు. ఈ క్రమంలోనే మూడు నాలుగు నెలలకు ఒకసారి బిల్లు వచ్చినా.. అందులో తమ వాటా కావాలంటూ ఎస్‌హెచ్‌ఓలను ప్రశ్నిస్తున్న డీఐలు కూడా ఉన్నారని, ఈ నేపథ్యంలో ఇరువురి మధ్య అక్కడక్కడ గొడవలు కూడా జరుగుతున్నాయని తెలిసింది. ఈ విషయాలు బయటకు వస్తే తమ ఉద్యోగాలకే ఎసరుపడుతుందని, అందరు గప్‌చుప్‌గా ఉంటున్నారు.

# గంటల తరబడి నిరీక్షణ

**చెక్కుల పంపిణీ ఒంటిగంటకని చెప్పి సాయంత్రం ఏడు గంటలకు అందజేసిన వైనం**




పరిగి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద చెక్కుల కోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారులు

పరిగి, నవంబర్ 20 : పరిగిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం మధ్యాహ్నం ఒంటి గంటకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ ఉందంటూ అధికారులు సమాచారమివ్వడంతో మండల పరిధిలోని వివిధ గ్రామాల నుంచి 170 మంది లబ్ధిదారులు, వారి కుటుంబసభ్యులు తరలిరాగా సాయంత్రం 7 గంటల ప్రాంతంలో చెక్కుల పంపిణీ జరగడం గమనార్హం. మధ్యాహ్నం కార్యక్రమం ఉందని చెప్పడంతో లబ్ధిదారులు ఉదయం 11 గంటల నుంచే పరిగికి చేరుకున్నారు. తాము ఇన్నాళ్లుగా వేచి చూస్తున్న చెక్కులు అందుతాయని ఆశగా పరిగికి చేరుకోగా.. ఏకంగా 6 గంటలపాటు ఎదురు చూస్తూ కూర్చోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. సార్ ఇక వస్తారంటూ మైకుల్లో అధికారులు ప్రకటించడం తప్ప సాయంత్రం వరకు ఎదురుచూపులు తప్పలేదని, గంటల తరబడి వేచి ఉండేలా చేయడం సరికాదని వాపోయారు. మంగళవారం కూడా ఉదయం 9 గంటలకు పరిగిలోని 7, 13వ వార్డుల్లో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన, ప్రారంభోత్సవం చేస్తారని ప్రకటించగా.. సాయంత్రం 6.30 గంటలకు కార్యక్రమం జరిగింది. దీంతో ఎమ్మెల్యే కార్యక్రమం అంటేనే అధికారులు హడలిపోతున్నారు. ఇచ్చిన సమయానికి, కార్యక్రమం జరుగుతున్న సమయానికి కనీసం నాలుగైదు గంటలపాటు తేడా ఉంటుండడంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు సైతం వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడుతున్నది.

### 170 మందికి చెక్కుల పంపిణీ

పరిగి మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులు 170 మందికి నాగర్‌కర్నూల్ పార్లమెంటు సభ్యుడు డాక్టర్ మల్లు రవి, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, రాష్ట్ర కిసాన్ కార్పొరేషన్ చైర్మన్ కోదండరాంరెడ్డి, ఎస్టీ కార్పొరేషన్ చైర్మన్ బెల్లయ్యనాయక్ కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆనంద్‌రావు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి